సాక్షి
జగిత్యాల
బుధవారం । 27 । మార్చి । 2024



హుండీ ఆదాయం లెక్కింపు

వేములవాడరూరల్: అగ్రహారం హనుమాన్ ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. రూ.2,21,877 నగదు సమకూరినట్లు కార్యనిర్వహణాధికారి మారుతి తెలిపారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ(సా॥)	సహర్ గురు(ఉ॥)
కరీంనగర్	6.28	4.45
పెద్దపల్లి	6.35	4.51
రాజన్న సిరిసిల్ల	6.35	4.53
జగిత్యాల	6.35	4.51

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.0/25.0

వాతావరణం పొడిగా ఉంటుంది.మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగే అవకాశముంది. ఉక్కపోత అధికం అవుతుంది.

న్యూస్‌రీల్

శ్రీవేంకటేశ్వరునికి ఘనంగా తెప్పోత్సవం



వేంకటేశ్వర స్వామికి తెప్పోత్సవం

ధర్మపురి: ధర్మపురి బ్రహ్మపుష్కరిణిలో మంగళవారం శ్రీవెంకటేశ్వర స్వామికి తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోరోజు కార్యక్రమాలను కనులపండువగా జరిపించారు. కోనేరులో స్వామివారిని హంసవాహనంపై ఉంచి ఐదు ప్రదక్షిణలు చేయించారు. అనంతరం భోగ మండపంలోని ఊయలపై స్వామివార్లకు డోలోత్సవం నిర్వహించారు. గోవింద నామస్మరణలతో కోనేరు మారుమోగింది.

కొండగట్టు అంజన్నకు వెండి గద బహూకరణ



అధికారులకు వెండి గద అందజేస్తున్న భక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్నకు సిద్దిపేట జిల్లా మిట్టపల్లి గ్రామానికి చెందిన పీర్లపల్లి మల్లారెడ్డి కుటుంబ సభ్యులు 250 గ్రాములతో తయారు చేయించిన వెండి గదను మంగళవారం ఆలయ అధికారులకు బహూకరించారు. ఆలయ సూపరింటెండెంట్ లతాదేవి, జూనియర్ అసిస్టెంట్ సంపత్‌కు అందించి రశీదు తీసుకున్నారు.

జగిత్యాల నుంచి ఢిల్లీకి రైల్వేలైన్ వేయిస్తా

- ఎంపీగా అవకాశం ఇవ్వండి
- యావర్‌రోడ్డు విస్తరణకు రూ.100కోట్లు తెస్తా



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: ఎంపీగా తనకు అవకాశమిస్తే జగిత్యాల నుంచి ఢిల్లీకి రైల్వేలైన్ వేయిస్తానని, రూ.100కోట్లు తెచ్చి జిల్లాకేంద్రంలోని యావర్‌రోడ్డు విస్తరణకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న తనను పార్లమెంట్‌కు పంపాలన్నారు. జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన పద్మశాలీ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడం ద్వారా సమస్యల పరిష్కారానికి వారధిగా నిలిచే అవకాశం లభించిందన్నారు. నాలుగు దశాబ్దాలుగా రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవకు అంకితమైన తనకు అండగా నిలవాలన్నారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, బల్దియా మాజీ చైర్మన్లు జీఆర్.దేశాయ్, గిరి నాగభూషణం, తాటిపర్తి విజయలక్ష్మి, నాయకులు గాజంగి నందయ్య, ఆకుబత్తిని శ్రీనివాస్, గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, అడువాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఖాకీ కళంకం



2023

- నవంబర్ 28న ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే కానిస్టేబుల్ శేఖర్ నాయక్ ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో విచారణ చేపట్టిన అధికారులు సస్పెండ్ చేశారు.
- రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ మహేందర్ అల్లీపూర్‌కు చెందిన ఓ వ్యక్తి వద్ద కోర్టు విషయంలో వసూళ్లకు పాల్పడగా 2024 ఫిబ్రవరి 2న సస్పెండ్ చేశారు.
- జగిత్యాల పట్టణ సీఐగా పనిచేస్తున్న నటేశ్ అవినీతి ఆరోపణలు, క్రైం బర్కింగ్ ఆరోపణల నేపథ్యంలో విచారణ చేపట్టి ఫిబ్రవరి 23న సస్పెండ్ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.
- మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే కానిస్టేబుల్ సుదర్శన్ అక్రమ వసూళ్లకు పాల్పడగా విచారణ చేపట్టిన పోలీసులు ఈనెల 22న సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.
- డీసీఆర్బీ ఎస్సైగా పనిచేస్తున్న వెంకట్రావ్ కొడిమ్యాల పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సమయంలో ఓ మహిళ కానిస్టేబుల్‌తో అసభ్యకరంగా ప్రవర్తించినందుకు విచారణ చేపట్టిన పోలీసులు ఈనెల 23న సస్పెండ్ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ ఉత్తర్వులు జారీచేశారు.
- ఇబ్రహీంపట్నం ఏఎస్సైగా పనిచేస్తున్న రాములు ఓ మహిళ పోలీస్‌స్టేషన్‌కు వస్తే ఆమెతో పరిచయం పెంచుకుని సన్నిహితంగా ఉండగా ఫొటోలు తీయించుకున్నాడు. అవి వైరల్ కావడంతో ఏఎస్సైని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఈనెల 25న ఉత్తర్వులు జారీ చేశారు. క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు మల్టీజోన్ ఐజీకి నివేదిక సమర్పించారు.
- మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించే హెడ్‌కానిస్టేబుల్‌తోపాటు, ఇద్దరు కానిస్టేబుళ్లు వారం క్రితం బయట వ్యక్తులతో పోలీస్‌స్టేషన్‌లోనే మద్యం సేవించిన విషయం వెలుగు చూడటంతో విచారణ చేపట్టిన పోలీసులు త్వరలోనే క్రమశిక్షణ చర్యలు చేపట్టేందుకు రంగం సిద్ధం చేశారు.

- దారి తప్పుతున్న పోలీస్ సిబ్బంది
- సీఐ, ఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్లు కూడా..
- తాజాగా ఏఎస్సై రాములు సస్పెన్షన్

జగిత్యాలక్రైం/మెట్‌పల్లి: జిల్లాలో కొందరు పోలీస్ సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు ఆ శాఖకు కళంకం తెస్తోంది. శాంతిభద్రతల విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకుంటూ ప్రజల మెప్పు పొందేలా ఉన్నతాధికారులు వ్యవహరిస్తుంటే కిందిస్థాయిలో మాత్రం కొందరు సిబ్బంది ఖాకీ చొక్కాను అడ్డం పెట్టుకుని తప్పుడు పనులు చేస్తూ పోలీస్ శాఖను అభాసు పాల్జేస్తున్నారు. దారి తప్పిన సిబ్బందిపై ఉన్నతాధికారులు వారం వ్యవధిలోనే వేటువేయడం ఇందుకు అద్దం పడుతోంది.

జేబులు నింపుతున్న అక్రమదందాలు

పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారుల నుంచే కాకుండా బయట అక్రమదందాలు నడిపే వారి నుంచి కూడా కొందరు సిబ్బంది వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇసుక, పేకాట, బెల్టు, మద్యం, కల్లు, దాబాలు, రేషన్ బియ్యం తదితర దందాలు చేసే వారి నుంచి నెలవారీగా మామూళ్లు వసూళ్లు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. స్టేషన్ల ఖర్చులతో పేరుతో కొన్నిచోట్ల ఎస్‌హెచ్‌ఓలు ఈ వసూళ్లకు పాల్పడుతుంటే.. కింది సిబ్బంది సైతం వారినే అనుసరిస్తూ జేబులు నింపుకుంటున్నారు. కొన్ని స్టేషన్లలో సివిల్ పంచాయితీలకు పెద్దపీట వేస్తున్నారు. నిబంధనల ప్రకారం.. సివిల్ కేసుల్లో పోలీసులు తల దూర్చరాదు. కానీ ఈ కేసుల్లో అధిక సొమ్ము వస్తుందనే ఆశతో ఎక్కువగా ఇలాంటి వాటిపైనే దృష్టి పెడుతున్నారు.



ఉన్నతాధికారుల చర్యలతో దారికొచ్చేనా..?

అక్రమ వసూళ్లు, మహిళల పట్ల వంకరబుద్ధి ప్రదర్శిస్తున్న పోలీస్ సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం చర్చనీయాంశమైంది. జిల్లావ్యాప్తంగా ప్రతి పోలీస్‌స్టేషన్‌లో జరుగుతున్న పోలీసుల వ్యవహారంపై ఆ శాఖ ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి కఠిన చర్యలు చేపడుతోంది. పోలీస్ శాఖలో పనిచేసే ప్రతిఒక్కరూ క్రమశిక్షణతో ఉండేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

పోలీస్‌స్టేషన్‌లోనే మాంసం, మద్యంతో జల్సా

- హెడ్‌కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్ల నిర్వాకం
- ఈనెల 17న ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి

మల్లాపూర్: ఈనెల 17న మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ముగ్గురు సిబ్బంది మాంసం, మద్యంతో జల్సా చేసుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ రోజు జగిత్యాలలో ప్రధాని మోదీ సభ ఉండడంతో బందోబస్తు కోసం ఎస్సై కిరణ్‌కుమార్ వెళ్లారు. దీంతో హెడ్‌కానిస్టేబుల్ అశోక్, కానిస్టేబుళ్లు ధనుంజయ్, సురేశ్ పోలీస్‌స్టేషన్‌లోకి మాంసం, మద్యం తెచ్చుకుని పార్టీ చేసుకున్నారని, వీరితో మరో ఇద్దరు బయటి వ్యక్తులు కూడా పాల్గొన్నారని సమాచారం. వారు పార్టీ చేసుకునే సమయంలో అక్కడికి వెళ్లిన ఓ అధికారి ఆ తతంగాన్ని చూసి సదరు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పార్టీలో పాల్గొన్నవారిలో ఒకరు విషయాన్ని బయట పెట్టడంతో విషయం జిల్లా పోలీస్ బాస్ దృష్టికి చేరింది. ఆయన సదరు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేసి విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. వీరిపై రెండు, మూడు రోజుల్లోనే క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. ఈ విషయమై ఎస్సైని సంప్రదించగా.. పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది జల్సా చేసుకుంది నిజమేనని, సిబ్బందిపై ఎస్పీకి నివేదించామని పేర్కొన్నారు.

క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



పోలీస్ అధికారులు, సిబ్బంది అంతా క్రమశిక్షణతో పనిచేయాలి. ప్రజలకు సత్వర సేవలందించడంతోపాటు, న్యాయం జరిగేలా చూడాలి. ఎలాంటి ఆరోపణలు వచ్చినా విచారణ చేపట్టి నిజమని తేలితే చర్యలు తీసుకుంటాం.

– సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీ

సాగునీటికి శాశ్వత పరిష్కారం చూపుతాం

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- వేంనూర్ పంప్‌హౌస్ ద్వారా నీరు విడుదల



నీరు విడుదల చేస్తున్న విప్ అడ్లూరి

వెల్గటూర్: చివరి ఆయకట్టు భూములకు సాగునీరందించేందుకు శాశ్వత పరిష్కారం చూపించడమే తన ప్రథమ కర్తవ్యమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం వేంనూర్ పంప్‌హౌజ్ నుంచి ముంజంపల్లి, మారేడుపల్లి గ్రామలకు సాగునీటిని విడుదల చేశారు. ముంజంపల్లి, మారేడ్‌పల్లి, ఉండెడ, సూరారం, గొడిశెలపేట, శాయంపేట రైతులు సాగునీటికి ఇబ్బంది లేకుండా శాశ్వత పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. మంత్రిగా పనిచేసిన కొప్పుల ఈశ్వర్ ఎల్లంపల్లి, కాళేశ్వరం నీరు హైదరాబాద్, గజ్వేల్, సిద్దిపేటకు తరలించుకుపోతున్నా మౌనంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. ఎల్లంపల్లి, కాళేశ్వరం లింక్-2లో ఈ ప్రాంతానికి వాటా తీసుకున్నాకే ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అనుమతిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, మేరుగు మురళీగౌడ్, సందీప్‌రెడ్డి, పూదరి రమేశ్, గెల్లు శ్రీనివాస్, గాజుల విజయ్, సురేష్, వెంకటస్వామి, శ్రీను, రవి, మహేష్ పాల్గొన్నారు.

నోడల్ అధికారులకు రవాణా భత్యం

కథలాపూర్: మండలస్థాయిలో పాఠశాలలను తనిఖీ చేసేందుకు విద్యాశాఖ నోడల్ అధికారులను నియమించిన విషయం తెలిసిందే. ప్రాథమిక స్థాయిలో తొలిమెట్టు, ఆరో తరగతి నుంచి 9వ తరగతుల విద్యార్థుల కోసం ఉన్నతి కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. వీటి అమలును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు సీనియర్ గెజిటెడ్ హెడ్మాస్టర్లను నోడల్ అధికారులుగా ఎంపిక చేశారు. ఇలా జిల్లాలో 18మంది పనిచేస్తున్నారు. వీరికి ప్రభుత్వం 2023–24 విద్యాసంవత్సరానికి రవాణా భత్యం కింద ఒకొక్కరికి నెలకు రూ.600 చొప్పున పది నెలలకు గాను రూ.1.08లక్షలు మంజూరైనట్లు నోడల్ అధికారులకు ఉత్తర్వులు అందాయి.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా, చిత్రంలో వివిధ శాఖల అధికారులు

- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. ఎంపీ ఎన్నికల నేపథ్యంలో మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను మంగళవారం పూర్తి చేశారు. జిల్లాలో 3 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహించే పీవోలు, ఏపీవోలు, వోపీవోలకు ర్యాండమైజేషన్ నిర్వహించామన్నారు. మొత్తం 1136 పీవోలు, 1136 ఏపీవోలు, 2272 మంది ఓవోపీలను నియమించామని, వారందరికీ శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు మధుసూదన్, ఆనంద్‌కుమార్, శ్రీనివాస్, హన్మంతరావు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించండి

యాసంగిలో సాగు చేసిన వరి కోతకు వస్తున్నందున జిల్లాల్లో వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. జిల్లా కలెక్టర్లతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కేంద్రాలను అధికారులు మాత్రమే ప్రారంభించాలన్నారు. ప్యాడీక్లీనర్లు, తేమయంత్రాలు, వేయింగ్‌మిషన్లు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. హమాలీల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. కేంద్రాలకు ట్యాగింగ్ చేయాలని పేర్కొన్నారు. వానాకాలానికి సంబంధించిన సీఎంఆర్ రైస్ వేగవంతం చేయాలని ఆదేశించారు.

జిల్లాలో 409 కొనుగోలు కేంద్రాలు

కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ. జిల్లాలో 409 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఐకేపీ 133, పాక్స్ 275, మెప్మా ఆధ్వర్యంలో ఒకటి చొప్పున కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. డీఆర్డీవో సంపత్‌రావు, సంక్షేమ అధికారి వాణిశ్రీ పాల్గొన్నారు.



కొండగట్టులో భక్తుల రద్దీ

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉదయం 11గంటల వరకు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఈవో చంద్రశేఖర్, ఏఈవో అంజయ్య, సూపరింటెండెంట్లు శ్రీనివాసశర్మ, సునీల్, రాజేశ్వరావు, సంపత్, గుడ్ల శ్రీనివాస్, ఉమామహేశ్వర్, లతాదేవి పర్యవేక్షించారు.



షుగర్ ఫ్యాక్టరీ కాంగ్రెస్‌కు ఎన్నికల స్టంట్

- ఎంపీ అర్వింద్ సోషల్ మీడియా యాక్టర్
- బీఆర్ఎస్ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



పొలాసలో ప్రచారం చేస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్


జగిత్యాలరూరల్: కాంగ్రెస్ నేతలకు షుగర్ ఫ్యాక్టరీ ఎన్నికల స్టంట్‌గా మారిందని, ప్రజల్లోనూ ఇదే వ్యక్తమవుతోందని బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఎంపీ అర్వింద్ సోషల్ మీడియా యాక్టర్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం పొలాసలో పాదయాత్ర నిర్వహించారు. ముందుగా రామాలయంలో వేద పండితుల ఆశీర్వాదం తీసుకుని ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల కార్యకర్తలతో సమావేశమయ్యారు. నిజామాబాద్ పీఠంపై బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణవాణి వినిపించాలంటే బీఆర్ఎస్ గెలిచి తీరాలిసిందేనని పేర్కొన్నారు. జీవన్‌రెడ్డి మాటలు చెవిలో పువ్వు పెట్టినట్లు ఉన్నాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీ డూప్లికేట్ పార్టీలన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మాజీ మంత్రి రాజేశంగౌడ్, ఎంపీపీ సంధ్యారాణి, జెడ్పీటీసీ మహేశ్, నాయకులు గట్టు సతీశ్, బాలముకుందం, నక్కల రవీందర్‌రెడ్డి, దశరథరెడ్డి, శీలం ప్రియాంక పాల్గొన్నారు.

అర్వింద్‌కు ఓటెందుకు వేయాలి?

జగిత్యాల: ఎంపీ అర్వింద్ ఈ ప్రాంతానికి చేసిందేమీలేదని, ఆయనకు ఎందుకు ఓటేయాలని బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. జిల్లాకేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎంపీగా కవిత ఎన్ని నిధులు తెచ్చారో ప్రజలందరికీ తెలుసునన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఎదుర్కోలేకనే రేవంత్‌రెడ్డి, మోదీ అక్రమ కేసులు నమోదు చేయిస్తున్నారని పేర్కొన్నారు. తనను గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తూ ప్రశ్నించే గొంతుగా మారుతానన్నారు.

ఆయిల్ పాం సాగువైపు అన్నదాతలు

- జిల్లాలో ఇప్పటికే నాలుగు వేల ఎకరాల్లో సాగు
- ఈ ఏడాది మరింత పెరగనున్న విస్తీర్ణం



మొక్కపై మందు పిచికారీ చేస్తున్న రైతు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఆయిల్ పాం సాగు విస్తీర్ణం పెంచేందుకు ఉద్యానశాఖ ప్రయత్నాలు మొదలుపెట్టింది. 2022–23లో 1832 ఎకరాల్లో సాగు చేపట్టిన రైతులు.. 2023–24లో 8,800 ఎకరాల్లో సాగు చేయాలని నిర్ణయించినా.. నర్సరీలో ఏడాది వయస్సున్న మొక్కలు అందుబాటులో లేకపోవడంతో 2200 ఎకరాల్లో మాత్రమే పరిమితం అయ్యారు. ఈ ఏడాది కూడా అత్యధిక విస్తీర్ణంలో సాగు చేపట్టేలా ఉద్యానశాఖ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఆయిల్ పాం సాగుకు జిల్లా వాతావరణం, నేలలు అనుకూలంగా ఉండటంతో ప్రభుత్వం జిల్లాకు ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ఉద్యానశాఖ సమాయత్తమవుతోంది.

గొల్లపల్లి నర్సరీలో మొక్కలు

జిల్లాకు మొక్కలు సరఫరా చేసే లోహియా ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గొల్లపల్లి మండలం అబ్బాపూర్‌లో నర్సరీని ఏ ర్పాటు చేసింది. ఈ మేరకు, నర్సరీలో జూన్ వరకు దాదాపు 3 లక్షల మొక్కలు సిద్ధంగా ఉండే అవకాశం ఉంది. ఆయిల్ పాం సాగుకు దరఖాస్తు చేసుకున్న వెంటనే నర్సరీ నుంచి మొక్కలు సరఫరా చేస్తున్నారు. లక్ష్యం పూర్తయ్యే వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారులు చెపుతున్నారు.

రైతులకు లాభం

రైతులకు సబ్సిడీపై మొక్కలు సరఫరా చేస్తారు. ప్రభుత్వమే రేటు నిర్ణయించి ఆయిల్ కంపెనీల ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోనుంది. ప్రస్తుతం టన్నుకు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు ధర ఉంది. ఎకరాకు 8 నుంచి 10టన్నుల దిగుబడి రానుంది. పంటను సాగు చేసే రైతులకు డ్రిప్ ఇవ్వనున్నారు. నాలుగేళ్ల పాటు తోట నిర్వహణ ఖర్చులు కూడా ఇస్తారు. పంటకు కోతులు, పిట్టలు, అడవిపందుల బెడద ఉండదు. తెగుళ్లు సోకే అవకాశం తక్కువ. రసాయన ఎరువులు పెద్దగా అవసరం ఉండదు. ఎకరాకు ఏటా రూ.80వేల నుంచి రూ.లక్ష ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం



ఆయిల్ పాం సాగు చేసే రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. మొదటి, రెండో ఏడాది సాగు చేసిన ఆయిల్ పాం తోటలు బాగున్నాయి. మూడో ఏడాది సాగు చేసేందుకు చాలామంది రైతులు ముందుకొస్తున్నారు.

– ప్రతాప్‌సింగ్, జిల్లా ఉద్యానశాఖాధికారి

భానుడి భగభగ

- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఉదయం పది దాటితే బయటకు రాని జనం
- నిర్మానుష్యంగా రహదారులు
- పొంచి ఉన్న వడదెబ్బ ముప్పు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



మధ్యాహ్నం మూడు గంటలకు గొల్లపల్లిలో నిర్మానుష్యంగా రహదారి

గొల్లపల్లి: జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. ఎండతీవ్రత రోజురోజుకూ పెరిగిపోతుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలకు మించి నమోదవుతున్నాయి. దీంతో ఉదయం 10 గంటలు దాటిందంటే చాలు జనాలు ఇళ్లనుంచి బయటకు రాలేని పరిస్థితులున్నాయి. రోడ్లపై జనసంచారం పూర్తిగా తగ్గింది. దుకాణాలు పగటిపూట బంద్‌చేసి సాయంత్రం వేళ తెరుస్తున్నారు. 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాడితే వడగాలులు వీచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ముమ్ముందు జిల్లాలో భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. విపరీతమైన ఎండలు కాసే సమయంలో విద్యార్థులు చిన్నారులు, వృద్ధులు, రైతులు, కూలీలు బయట తిరగొద్దని అధికారులు, వైద్యులు సూచిస్తున్నారు. లేకుంటే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరిస్తున్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు

45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైతే వేడి తీవ్రత పెరిగి వడగాలులు వీస్తాయి. 40 డిగ్రీల సెల్సియస్ దాటితే శరీరంలో వేడిని నియంత్రించే వ్యవస్థ దెబ్బతింటుందని, తద్వారా ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడుతుందంటున్నారు వైద్యులు. వడదెబ్బ రాకుండా చూసుకోవాలని, వడదెబ్బ బారిన పడితే కోలుకునేందుకు చాలా సమయం పడుతుందంటున్నారు.

లక్షణాలు

- శరీర ఉష్ణోగ్రత పెరగడం
- తీవ్రమైన తలనొప్పి, వాంతులు, ఒళ్ల నొప్పులు
- నాడి వేగంగా కొట్టుకోవడం, శరీరం తిమ్మిరెక్కడం, నాలుక, చర్మం ఎండిపోవడం
- శరీరంలో నీటిశాతం తగ్గిపోవడం

జాగ్రత్తలు

- నేరుగా ఎండలో తిరుగొద్దు. అత్యవసర సమయంలో బయటకు వెళ్తే తలపై రుమాలు తప్పనిసరి ధరించాలి
- ముదురు రంగు, పాలిస్టర్ దుస్తులు ధరించరాదు
- చల్లటి నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీరు, ద్రవ పదార్థాలను తీసుకోవాలి
- జంక్‌ఫుడ్ తగ్గించాలి
- దోస, పుచ్చ, తాటిముంజలు, తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి
- మద్యం, మాంసాన్ని తగ్గించాలి
- ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఇంటి పట్టున ఉంటే మంచిది.
- వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే చల్లని నీడ ప్రదేశానికి చేర్చాలి
- శరీరానికి గాలి తగిలేలా చూడాలి
- తడిగుడ్డతో శరీరాన్ని తరచూ తుడుస్తుండాలి
- ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరిబోండాం, ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలి
- వీలైనంత తొందరగా దగ్గరలోని ఆస్పత్రులకు తరలించి వెంటనే వైద్యం అందించాలి

జాగ్రత్తగా ఉండాలి



వీలైనంతవరకు నీడ పట్టున ఉంటూ పనులు చేసుకోవాలి. తప్పని పరిస్థితిలో పనులు చేయాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వడదెబ్బ బారిన పడితే తల తిప్పడం, వాంతులు, విరోచనాలు అవుతాయి. చర్మం పొడిబారి జ్వరం వంటి లక్షణాలు కన్పిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలి.

– శ్రీనివాస్, జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి

క్లుప్తంగా

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు



బోల్తాపడిన కారు

వేములవాడరూరల్: కరీంనగర్ నుంచి సిరిసిల్లకు వెళ్తున్న కారు రోడ్డుపై కుక్కను తప్పించబోయి బోల్తా పడిన ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. వేములవాడ అర్బన్ మండల పరిధి కొడుముంజ నందికమాన్ మీదుగా మోసిన్, రషీద్ కారులో సిరిసిల్లకు వెళ్తున్నారు. ఈ క్రమంలో రోడ్డుపై కుక్క కనిపించడంతో దానిని తప్పించే ప్రయత్నంలో ప్రమాదానికి గురయ్యారు. గాయపడిన ఇరువురిని చికిత్స కోసం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

పెద్దపల్లిరూరల్: గోపయ్యపల్లి గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు పల్లె రాజం మంగళవారం బైక్ అదుపుతప్పడంతో కింద పడ్డ ప్రమాదంలో చేయి విరిగింది. రాజం పనినిమిత్తం కమాన్‌పూర్ వెళ్లి తిరిగి వస్తుండగా గుండారం – సబ్బితం ప్రాంతంలో బైక్ అదుపుతప్పి కిందపడి పోయాడు. స్థానికులు 108 వాహనంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి చికిత్స అందిస్తున్నారు.

యువకుడి నేత్రాలు సజీవం



శివకుమార్(ఫైల్)

కరీంనగర్‌టౌన్: పెద్దపల్లి జిల్లా రొంపికుంట గ్రామానికి చెందిన తాళ్ల శివకుమార్(23) రోడ్డు ప్రమాదంలో మరణించగా... మహాదేవ సేవా ఫౌండేషన్ కరీంనగర్ అధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులను ఒప్పించి నేత్రదానం చేయించారు. కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రామమ్మ ఇంటర్నేషనల్ ఐ బ్యాంక్ వారు నేత్రాలు సేకరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు అవారి రాజ్ కుమార్ మాట్లాడుతూ నేత్రదానం చేయడం వల్ల మరో ఇద్దరికి చూపు ప్రసాదించడం జరుగుతుందన్నారు. నేత్ర, అవయవ దానికి ప్రతీఒక్కరు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మామిడాల సుమంత్, తడిగోపుల అజయ్, వడ్లకొండ అనిల్ పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లిలోని ఓ ఇంట్లో రహస్యంగా పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. వారి నుంచి రూ.18,500 స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రాజన్నకు రూ.2 కోట్ల ఆదాయం



హుండీ ఆదాయం లెక్కిస్తున్న వలంటీర్లు

వేములవాడ: వేములవాడ రాజన్నకు 21 రోజుల్లో రూ.2.21 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. మంగళవారం కట్టుదిట్టమైన భద్రత మధ్య స్వామివారి హుండీలలోని డబ్బులను ఆలయ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు లెక్కించారు. 21రోజుల్లో ఈ ఆదాయం సమకూరినట్లు ఈవో పేర్కొన్నారు. అలాగే 463 గ్రాముల బంగారం, 19.800 కిలోల వెండి సమకూరినట్లు వివరించారు.

రాజన్న కల్యాణ వేదిక మార్పు

- చైర్మన్ చాంబర్ ఎదుట కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు
- రేపు రాజన్న కల్యాణం
- చొరవచూపిన ప్రభుత్వ విప్

సాక్షి ఎఫెక్టు



శివకల్యాణోత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లు

వేములవాడ: ఏటా శివకల్యాణోత్సవంలో భక్తులు పడిన ఇబ్బందులు అన్నీఇన్ని కావు..ఈక్రమంలో 'భక్తులు పడుతున్న తిప్పలు'.. 'ఇరుకైన ప్రదేశంలో ఇలవేల్పు కల్యాణం' అనే కథనాలకు స్పందించిన ఆలయ అధికారులు ఎట్టకేలకు పార్వతీరాజరాజేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని చైర్మన్ చాంబర్ ఎదు ట నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. భారీ కల్యాణ వేదిక, గుడి పరిసరాల్లో శివపార్వతులు, జోగినులు, హిజ్రాలు కల్యాణం వీక్షించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో కేవలం ఆలయంలోని అద్దాల మంటపంలో ఇరుకైన ప్రదేశంలో కల్యాణోత్సవం జరిగేది. దీంతో కేవలం తక్కువ సంఖ్యలో భక్తులు డైరెక్ట్‌గా కల్యాణం వీక్షించేవారు. ఈక్రమంలో ప్రభు త్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకుని రాష్ట్ర దేవాదాయశాఖ అధికారులు, శృంగేరి పీఠాధిపతుల అనుమతులు తీసుకుని వేదికను మార్పు చేయించారు. దీంతో భక్తుల తిప్పలు తప్పనున్నాయి. చలవపందిళ్లు, బారీకేడ్లు, తాగునీటి సౌకర్యం తదితర ఏర్పాట్లు చేస్తున్నారు.

నేటి నుంచి కల్యాణోత్సవాలు

ఈనెల 27 నుంచి 31 వరకు ఐదు రోజులపాటు రాజన్న ఆలయంలో నిర్వహించే శివకల్యాణోత్సవాలకు ప్రధానాలయంతోపాటు పరిసరాల్లో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానాలయంలోని కోడెలు కట్టే ప్రదేశంలో ప్రత్యేక యాగశాల ఏర్పాటు చేశారు. ఈనెల 28న ఉదయం 10.50 గంటల నుంచి మధ్యాహ్నం 12.55 గంటల వరకు శ్రీపార్వతీరాజరాజేశ్వర స్వామివారల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. 30న సాయంత్రం 5 గంటలకు స్వామివారి రథోత్సవం భక్తులు, శివపార్వతులు, జోగినులు, హిజ్రాల నృత్యాల మధ్య మెయిన్‌రోడ్డులో నిర్వహించనుండగా, రథాలను సిద్ధం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈవో కృష్ణప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

కొనసాగుతున్న నృసింహుడి బ్రహ్మోత్సవాలు





దక్షిణ దిగ్యాత్రకు వెళ్తున్న శ్రీలక్ష్మీనృసింహుడు



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా జరిపిస్తున్నారు. ఉత్సవాల్లో ఏడో రోజు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వారికి ఆలయ అధికారులు, మున్సిపల్ అధికారులు సకల సౌకర్యాలు కల్పించారు. పాత టీటీడీ కల్యాణ మండపంలో ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. ముందుగా భక్తులు పవిత్ర గోదావరిలో స్నానాలు ఆచరించి అనంతరం ఆలయాల్లో మొక్కులు చెల్లించారు. ఆర్మూర్, నిర్మల్, నిజామాబాద్ తదితర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఆలయం నుంచి శోభాయాత్ర

దక్షిణ దిగ్యాత్ర సందర్భంగా ఆలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు అశ్వవాహనంపై శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఒగ్గు డోలు కళాకారుల విన్యాసాలు, డీజే సౌండ్స్, పోలీసుల నృత్యాల మధ్య స్వామివారు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. పోలీస్ అధికారులు ఆలయానికి వెళ్లి స్వామివార్లను స్టేషన్‌కు ఆహ్వానించారు. అనంతరం శోభాయాత్రగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, డీఎస్పీ రఘుచందర్, ఎస్సైలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

కలిసి ఉండేందుకు నిరాకరించిందని..

- యువతిని హత్య చేసిన నిందితుని అరెస్ట్
- రెండు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం
- రిమాండ్‌కు తరలింపు..



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నీలం రవి

మల్యాల(చొప్పదండి): ప్రేమించి పెళ్లి చేసుకుని.. కుటుంబ కలహాలతో విడాకులు తీసుకున్నాక మళ్లీ కలిసి ఉందామని నమ్మించాడు. ఆమె అంగీకరించకపోవడంతో ఆమె గొంతు నులిమి చంపేశాడు. ఈనెల 17న జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలను మల్యాల పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సీఐ నీలం రవి విలేకరులకు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా ముంద్రాయి మండలం నంగనూర్‌కు చెందిన కరిపె అంజలి జగిత్యాలలోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటుండగా గొల్లపల్లి మండలం అగ్గిమల్ల గ్రామానికి చెందిన కొల్లూరి నరేశ్‌తో 2018లో పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారి 2020లో వివాహం చేసుకున్నారు. కుటుంబ కలహాలతో 2022లో విడాకులు తీసుకున్నారు. అనంతరం అంజలిని యాద్రాద్రి జిల్లా గుండాల మండలం మాసంపల్లి గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డికిచ్చి వివాహం జరిపించారు. అయినా నరేశ్ అంజలికి తరచూ ఫోన్ చేసి మళ్లీ కలిసి జీవిద్దామంటూ వేధించేవాడు. ఈ క్రమంలో ఈనెల 17న అంజలి జగిత్యాల కొత్త బస్టాండ్‌కు రాగా.. నరేశ్ ఆమెను బైక్‌పై జాబితాపూర్ మీదుగా అగ్గిమల్ల వైపు తీసుకెళ్లాడు. మల్యాల మండలం మ్యాడంపల్లి శివారులోకి రాగానే అంజలి నిలదీయడంతో తనను మోసం చేసి, మరొకరిని ఎలా వివాహం చేసుకుంటావంటూ రోడ్డు పక్కన బైక్ నిలిపి.. అంజలిని కొట్టి, గొంతు నులిమి చంపి మృతదేహాన్ని సమీపంలోని చిన్న కాలువలో పడేసి వెళ్లాడు. అంజలి తల్లి రజిత మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో ముత్యంపేటలోని కొండగట్టు బస్టాండు వద్ద బైక్‌పై పారిపోతుండగా నరేశ్‌ను పట్టుకుని విచారణ చేపట్టారు. ఇందులో అంజలిని తానే గొంతు నులిమి చంపినట్లు ఒప్పుకున్నాడని సీఐ తెలిపారు. నిందితుడి నుండి బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని.. నరేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ నీలం రవి తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు అబ్దుల్ రహీం, కుమారస్వామి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కన్నీళ్లు మిగిల్చిన కాంగ్రెస్

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- ఎండిన వరి పంట పరిశీలన



ముత్తారం(మంథని): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రైతులకు కన్నీళ్లు మిగిల్చిందని మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. సీతంపల్లి, ఇప్పలపల్లి(రామకృష్ణాపూర్)లో సాగునీరు అందక ఎండిన వరి పంటను జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌తో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. కేసీఆర్ ప్రభుత్వంలో గుంట కూడా ఎండ లేదన్నారు. భూగర్భ జలాలు అడుగంటడంతో రాష్ట్రంలో 20లక్షల ఎకరాల్లో పంటలు ఎండినా సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మహత్యలు లేని తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే రైతులు ఆత్మహత్య చేసుకోవడం పరిస్థితికి అద్దం పడుతోందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆయకట్టుకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ మాట్లాడుతూ, మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఎండిన పంటలు పరిశీలిస్తున్నామని తెలిపారు.

మల్లాపూర్‌లో రూ.85వేల నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో ఎస్సై కిరణ్‌కుమార్



తనిఖీ చేస్తున్న పోలీసులు

మల్లాపూర్: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం సాయంత్రం చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ.85వేల నగదు పట్టుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల విధుల్లో భాగంగా వాహనాల తనిఖీ చేస్తుండగా.. సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.85వేలను స్వాధీనం చేసుకుని గ్రీవెన్స్‌సెల్‌కి అప్పగించినట్లు తెలిపారు. తనిఖీల్లో పోలీస్ కానిస్టేబుళ్లు సురేష్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.54,500 నగదు పట్టివేత

మల్యాల(చొప్పదండి): సరైన పత్రాలు లేకుండా రూ.54,500 తీసుకెళ్తున్న వాహనదారుడి నుంచి మల్యాల పోలీసులు స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు. మండలంలోని ముత్యంపేట కొండగట్టు బస్టాండ్ వద్ద ఎస్సై అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. నిర్మల్ మండలం లోకేశ్వరం మండలానికి చెందిన నిమ్మ శివన్న వాహనంపై కరీంనగర్ నుంచి లోకేశ్వరం వైపు వెళ్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. ఇందులో రూ.54,500 పట్టుబడింది. డబ్బులకు ఆధారాలు లేకపోవడతో సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

నగదు పట్టివేత

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం పెద్దమ్మ చెక్‌పోస్టు వద్ద పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.లక్షా 52వేల 800 నగదు స్వాధీనం చేసుకున్నారు. సిరిసిల్లకు చెందిన కట్ట సతీశ్ ఎటువంటి ఆధారాల్లేకుండా రూ.92,800, మండలంలోని గోరింటాలకు చెందిన బండ సత్తవ్వ ఎలాంటి ఆధారాల్లేకుండా రూ.60వేల నగదు తీసుకెళ్తుండగా.. విచారించి సీజ్ చేశారు. ఎన్నికల విభాగం సిరిసిల్ల రిటర్నింగ్ ఆఫీసర్‌కు అప్పగించినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

పడగ విప్పిన పొలి పగ

- భూ తగాదాలతో ఇద్దరు బలి
- ఒకరు ఆత్మహత్య.. మరొకరి హత్య
- జగిత్యాల జిల్లా ధర్మపురిలో విషాదం



పులి రేణుక మృతదేహం



హత్యకు గురైన పులి పద్మ

ధర్మపురి: సాగు భూమి విషయంలో తరచూ గొడవ పడుతుండడంతో మనస్తాపానికి గురైన ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఆగ్రహానికి గురైన ఆమె భర్త.. దీనంతటికీ ఓ మహిళ కారణమని భావించి కల్లు గీసే ఉలితో గొంతుకోసి హత్య చేశాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం కమలాపూర్‌లో విషాదం నింపింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పులి లస్మయ్య, గంగన్న వరుసకు అన్నదమ్ములు. లస్మయ్య, గంగన్న ఇద్దరూ గీతవృత్తిదారులు. ఇరువురి భార్యలు బీడీలు చుడుతుంటారు. పక్కపక్కనే ఇరువురికీ భూమి ఉంది. కొంతకాలంగా వారిమధ్య గెట్ల పంచాయితీ నడుస్తోంది. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గంగన్న భార్య రేణుక (50) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె భర్త గంగన్న సాయంత్రం ఇంటికొచ్చేసరికి వేలాడుతూ కనిపించింది. తన భార్య రేణుకను లస్మయ్య కుటుంబ సభ్యులే చంపారని భావించిన గంగన్న ఆవేశంతో వెళ్లి లస్మయ్య భార్య పద్మ (45)ను కల్లు గీసే ఉలితో మెడపై కోశాడు. దీంతో పద్మ రక్తపుమడుగులో అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలిసిన వెంటనే భర్త లస్మయ్య ఇంటికి చేరుకుని భయాందోళనతో పరుగులు తీశాడు. ఆత్మహత్య చేసుకున్న రేణుకకు ఇద్దరు కుమారులు ఉన్నారు. హత్యకు గురైన పద్మకు కుమారుడు, కూతురు ఉన్నారు.

శోక సంద్రంలో రెండు కుటుంబాలు

పులి రేణుక ఆత్మహత్య చేసుకోవడం.. పద్మ హత్యకు గురికావడంతో రెండు కుటుంబాలు శోక సంద్రంలో మునిగిపోయాయి. పద్మ ఇంట్లోకి పోలీసులు ఎవరినీ అనుమతించలేదు. రేణుకను లస్మయ్య కుటుంబమే ఉరివేసి చంపారంటూ గంగన్న రోదిస్తూ తెలిపాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గ్రామానికి చేరుకొని ఇరు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆత్మహత్య, హత్యకు గల కారణాలు దర్యాప్తులో తేలనున్నాయని, సంఘటనపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

ఎల్‌ఎండీ ఎగువకు ఏప్రిల్ 2 వరకే సాగునీరు



ఎస్సారెస్పీ నుంచి స్టేజీ-2కు విడుదలవుతున్న నీరు

జగిత్యాలఅగ్రికల్చర్: ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువ ద్వారా ఎల్‌ఎండీ ఎగువ ఆయకట్టు (జోన్-2)కు ఏప్రిల్ రెండోతేదీ వరకే సాగునీరు అందించనున్నట్లు ప్రాజెక్టు అధికారులు ప్రకటించారు. ఎస్సారెస్పీలో నీటి మట్టం 17.183 టీఎంసిలకు పడిపోవడంతో ఎల్‌ఎండి దిగువ భాగం (జోన్-1) ఆయకట్టుకు ఈనెల 25వరకే నీటి విడుదల నిలిపివేశారు. కాకతీయ కాలువ ప్రారంభం నుంచి డి-53 (జగిత్యాల ప్రాంతం) వరకు కాలువ తూములను ప్రాజెక్టు అధికారులు మూసివేశారు. ప్రాజెక్టులో నీరు డెడ్ స్టోరేజీకి చేరడంతో మిగిలిన నీటిని తాగునీటి అవసరాలకు నిల్వ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి లక్ష్మీకెనాల్‌కు 200 క్యూసెక్కులు, సరస్వతి కెనాల్‌కు 300, అలీసాగర్ ఎత్తిపోతలకు 347, గుత్ప ఎత్తిపోతలకు 146, మిషన్ భగీరథ కింద కోరుట్ల, జగిత్యాల, ఆర్మూర్, నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్ ప్రాంతాలకు 231క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో రోజుకు 432 క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది.

విషాదం నింపిన కోడిగుడ్డు వివాదం

- చికిత్స పొందుతూ మహిళ మృతి



రమ (ఫైల్)

జగిత్యాలరూరల్: కోడిగుట్టు వివాదం విషాదం నింపింది. ఈ గొడవలో కొడవలి వేటుకు గురైన మహిళ తీవ్రగాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయింది. కుటుంబసభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం.. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన మేడిపల్లి సురేశ్–రమ(40)దంపతులకు కొడుకు రిషివర్ధన్, కుమార్తె వాణి ఉన్నారు. సురేశ్ ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. వీరి కుమార్తె వాణిని ఇదే గ్రామానికి చెందిన బోగ ప్రకాశ్ అనే యువకుడు కొద్ది రోజుల క్రితం పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో సురేశ్, రమ దంపతులు నిరాకరించారు. కక్ష పెంచుకున్న ప్రకాశ్ సోమవారం జరిగిన హోలీ వేడుకల్లో రమ ఇంట్లోకి కోడిగుడ్డు విసిరాడు. దీంతో రిషివర్ధన్ తమ ఇంట్లోకి కోడిగుడ్డు ఎందుకు విసిరావని ప్రకాశ్‌ను నిలదీయగా రిషివర్ధన్‌పై దాడిచేశాడు. స్థానికంగా ఉన్న వారు రిషివర్ధన్ తల్లి రమకు సమాచారం అందించడంతో అక్కడకు వెళ్లింది. ఈ క్రమంలో ప్రకాశ్ కొడవలితో రమ మెడపై దాడి చేశాడు. గొంతుకు తీవ్ర గాయాలు కావడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. మృతురాలి కొడుకు రిషివర్ధన్ ఫిర్యాదు మేరకు ప్రకాశ్‌పై హత్య కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐఆరీఫ్ అలీఖాన్, రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

గ్రామంలో విషాదం

తిప్పన్నపేట గ్రామంలో మేడిశెట్టి రమ హోలీ సంబరాల్లో కోడిగుడ్డు వివాదంలో హత్యకు గురికాగా గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. సోమవారం ఉదయం అందరు మహిళలతో కలిసి హోలీ సంబరాల్లో పాల్గొన్న రమ హత్యకు గురికావడం గ్రామస్తులను తీవ్రంగా కలిచివేసింది. దుబాయ్‌లో ఉన్న ఆమెభర్త సురేశ్ మంగళవారం స్వగ్రామానికి చేరుకోవడంతో అంత్యక్రియలు నిర్వహించారు.

చిట్టిగుండెకు పెద్దకష్టం

- చిన్నారి గుండెకు రంధ్రం
- రేషన్‌కార్డు లేకపోవడంతో వైద్యానికి వర్తించని ఆరోగ్యశ్రీ
- ఇప్పటికే రూ.6 లక్షల ఖర్చు
- మరో రూ.7 లక్షలు అవసరం
- దాతల కోసం పేద కుటుంబం ఎదురుచూపు



తల్లిదండ్రులతో అక్షర

గంగాధర: రెక్కాడితే కానీ డొక్క నిండని పరిస్థితి ఆ కుటుంబానిది. అయినా చెరోకష్టం చేసుకుంటూ ఆ దంపతులు వారి ఇద్దరు కూతుళ్లను పోషించుకుంటున్నారు. పెద్ద కూతురు గుండెకు రంధ్రంతో జన్మించగా.. ఎనిమిదేళ్లుగా మందులు వాడుతోంది. శాశ్వత పరిష్కారం కోసం ఆపరేషన్ చేయాల్సి ఉండగా.. ఆ కుటుంబానికి రేషన్‌కార్డు లేకపోవడంతో ఆరోగ్యశ్రీ వర్తించడం లేదు. ఇప్పటికే మందులకు రూ.6లక్షలకు పైగా ఖర్చుచేయగా.. శాశ్వత పరిష్కారానికి ఆపరేషన్ చేయాలంటే మరో రూ.7లక్షలు అవసరం కానున్నాయి. పేద కుటుంబం కావడంలో దాతలకోసం ఎదురుచూస్తున్నారా దంపతులు. గంగాధర మండలం మధురానగర్‌కు చెందిన రామగిరి నరేశ్–శిరీష దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్దకూతురు అక్షరకు ఎనిమిదేళ్లు. పుట్టుకతోనే గుండెకు రెండు రంధ్రాలు ఏర్పడ్డాయి. సమస్యను పరిశీలించిన వైద్యుల సూచనల మేరకు మందులు వాడుతున్నారు. ప్రస్తుతం ఒక హోల్ కూరుకుపోగా.. మరొక రంధ్రం సమస్యను తీవ్రం చేస్తోంది. ఈ హోల్‌తో చెడురక్తం, మంచి రక్తం కలిసి వెళ్తుండడంతో తీవ్ర అనారోగ్యపాలవుతోంది. నిత్యం నీరసం, జ్వరం, ఆయాసంతో బాధపడుతోందని తల్లిదండ్రులు తెలిపారు. త్వరగా ఆపరేషన్ చేయిస్తే ఆరోగ్యం మెరుగవుతుందని, రేషన్ కార్డు ఉంటే ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా ఆపరేషన్ చేస్తామని, లేకుంటే రూ.7లక్షలు ఖర్చవుతాయని వైద్యులు చెప్పినట్లు వెల్లడించారు. రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసి ఏళ్లు గడుస్తోందని, తమ సమస్యపై ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు. తమ కూతురు వైద్యానికి దాతలు సహకరించాలని వేడుకుంటున్నారు.

రైలింజన్‌లో పొగలు



రామగుండంలో నిలిచిన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్

రామగుండం: జాసదియా(ఛత్తీస్‌గఢ్) జంక్షన్ నుంచి వాస్కోడగామ(గోవా) వెళ్తున్న రైలు ఇంజన్(నంబరు 17322)లో మంగళవారం రాత్రి పొగలు వచ్చాయి. అప్రమత్తంగా వ్యవహరించిన లోకోపైలట్లు రామగుండంలో రైలు నిలిపివేశారు. పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం పెద్దంపేట రైల్వేస్టేషన్ దాటిన తర్వాత రైలింజన్ నుంచి స్వల్పంగా పొగలు రావడాన్ని లోకోపైలట్లు గమనించారు. ఆ వెంటనే రామగుండం రైల్వే లోకో ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. రామగుండం చేరుకోగానే రైలు నిలిపివేశారు. మంచిర్యాలకు మంగళవారం మధ్యాహ్నం 2.34 గంటలకు చేరుకోవాల్సిన వాస్కోడగామ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు.. ఐదు గంటల ఆలస్యంగా రాత్రి 7.09 గంటలకు మంచిర్యాలకు చేరుకుంది. తర్వాత కాజీపేటలోనే హాల్టింగ్ ఉండగా రైలింజన్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో పొగలు రాగా రామగుండంలో అత్యవసరంగా నిలిపివేశారు. స్థానిక లోకో ఉన్నతాధికారులు దానిని వేరుచేసి మరో ఇంజన్‌ను తగిలించి రైలును పంపించారు. రామగుండంలో రెండు గంటల ఆలస్యం కావడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

మద్యం మత్తులో మైనర్ల హంగామా

- నడిరోడ్డుపై తన్నుకున్న వైనం
- చైల్డ్ వెల్ఫేర్ అధికారులపై రాళ్లు రువ్విన బాలురు



పారిపోతున్న బాలుడిని పట్టుకున్న చైల్డ్‌వెల్ఫేర్ సిబ్బంది

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని విద్యానగర్ బైపాస్‌రోడ్‌లో పోచమ్మవాడకు చెందిన నలుగురు మైనర్ బాలురు అతిగా మద్యం సేవించి మంగళవారం సాయంత్రం హంగామా సృష్టించారు. ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. భయభ్రాంతులకుగురైన స్థానికులు 1098కు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చేసరికి ముగ్గురు బాలురు విద్యానగర్ వైపు పారిపోయారు. ఓ బాలుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా సిబ్బందిపై రాళ్లు రువ్వారు. చైల్డ్‌వెల్ఫేర్ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి బాలుడిని అదుపులోకి తీసుకుని కరీంనగర్‌లోని ఓ వసతి గృహానికి తరలించినట్లు సమాచారం.

నదిలో దూకేందుకు యువకుడి యత్నం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి గోదావరి బ్రిడ్జిపై నుంచి నదిలోకి దూకేందుకు ప్రయత్నించిన యువకుడిని పోలీసులు కాపాడారు. పోలీసుల కథనం ప్రకారం.. కమాన్‌పూర్ మండలం పేరపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు మంగళవారం గోదావరి నదిలో దూకేందుకు వస్తున్నట్లు టూటౌన్ సీఐ రవీందర్‌కు సమాచారం అందింది. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో గోదావరి బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఎస్ఎస్‌టీం పోలీసులకు సీఐ వెంటనే సమాచారం అందించారు. దీంతో హెడ్‌కానిస్టేబుల్ జంపయ్య, కానిస్టేబుల్ పూర్ణచందర్ ఆ యువకుడిని గమనించి నదిలో దూకకుండా అడ్డుకున్నారు. తర్వాత కౌన్సెలింగ్ ఇచ్చి తన కుటుంబ సభ్యులకు అప్పగించారు.